నిరీక్షణ

ఎ.వి.వి.యస్.యస్.ప్రసాద్

యంత్రంలా సాగిపోతున్న జీవన సరళిలో అతనిరాక ఒకగొప్ప అనుభూతి—

జీవితంలో ఎదురైన చేదు అనుభవం అతని జీవితాన్నే మార్చేసింది.

అనుభూతినే ఊపిరిగా పిలుస్తూ దూరమై పోయిన 'ఆనందాన్ని' ఆస్వాదించడానికి, అందుకోడానికి ప్రయత్నిస్తున్నాడతను....

నిరీక్షణలో మాధుర్యాన్ని అనుభవిస్తున్నాడా? !

అదో విచిత్రమైన స్థితి—అతనిది!

ఆనందం లాంటి విచారం !

విచారం లాంటి ఆనందం !

❀ ❀ ❀

అదో చిన్న రైల్వే స్టేషన్.

మళ్ళీ సాయంత్రం ఆరింటికి ఓ ప్యాసింజర్ వస్తుంది. దాంట్లోంచి ఒకరిద్దరు కన్నా దిగరు. వెళ్ళేవాళ్ళు ఒక్కోసారి అసలు వుండరు. అడపా దడపా నాలు గైదు గూడ్స్ బళ్ళు వస్తుంటాయి. అందుకే పెద్దగా పన్లు వుండవు. వున్నా వున్నట్టు అన్పించదు.

నేనక్కడ అసిస్టెంట్ స్టేషన్ మేష్టార్ని.

ఈ ప్రాంతానికి బదిలీ అయి దాదాపు రెండేళ్ళు అయ్యింది. ఇక్కడ కొచ్చిన కొత్తలో ఇక్కడి వాతావరణం అలవాటు అవ్వడం కాస్త కష్టమే అయ్యింది.

పట్నంలో పుట్టి పెరగడంవల్ల పల్లెటూరి వాతావరణం కొత్తగా, కొంచెం ఇబ్బందిగా వుంది....వచ్చిన రెండో రోజునే, జలుబు....జ్వరం....

వైద్య సహకారాలు పెద్దగాలేవు. ఏదో అదృష్టం బాగుండి ఓ వారం తరువాత కోలుకున్నాను! తరువాత క్రమేణా వాతావరణానికి అలవాటు పడ్డాను.

వాతావరణంతో 'అవగాహన' ఏర్పడ్డాకా, అక్కడి జనం, వాళ్ళ వేష భాషలు కూడా అర్ధమయ్యాయి. అంతా అర్ధమయ్యాకా, అంతా ఆనందమే!

అక్కడి వాళ్ళతో నేను కలిశాను. నాతోవాళ్ళు కలిశారు. స్టేషన్లో పెద్దగా పనులు వుండవు. ఎక్స్‌ప్రెస్ బళ్ళు వచ్చినప్పుడు సిగ్నల్స్ చూపెట్టడం....రెండే రెండు 'ఎక్స్‌ప్రెస్సులు' వస్తాయి రోజుకి......అవి పుదయం వేళలలో రావడంతో. ..దాదాపు మధ్యాహ్నమంతా ఖాళీయే!

ఏడాది కొకసారి ఈ ప్రాంతంలో తిరునాళ్ళ లాంటిది జరుగుతూ వుంటుంది. అప్పుడే కాస్త రద్దీగా వుంటుంది. అందుకే....

పొద్దున్నుండి సాయంత్రం వరకు గడపడం సుద్దబోరు. కానీ వుద్యోగ ధర్మం తప్పదు.

రోజంతా భరించలేని వేడిమిని భరించడంవల్ల సాయంత్రం కోసం, సాయంత్రం వీచే చల్లని పిల్లగాలులకోసం ఎదురు చూడడం నా జీవితంలో నిత్యకృత్యమయి పోయింది.

ఇక్కడి సాయంత్రం నిజంగా చాలా అందంగా వుంటుంది.

ఆ అందానికి పన్నెతెస్తూ-

ప్రకృతి సంధ్యారాగ సంకీర్తన -

దూరంగా గూళ్ళవైపు సాగిపోతున్న పక్షుల గుంపులు. ఏవో సందేశాలు హడావిడిగా మోసుకుపోతూ నీలిమేఘాలు.

పిల్లగాలి కెరటాల సప్తస్వరాలు.

నిశ్శబ్ద సౌందర్యం-!

అలాంటి సమయంలో

‘ అతను ’ వస్తున్నాడు.

అతనిపేరు తెలీదు.

దాదాపు ఏడాదినుండి వస్తున్నాడు.

మా యిద్దరి మధ్య మాటల్లేవు.

చూపులతోనే పలకరింత.

అందమైన నిశ్శబ్దం ఇద్దరిమధ్య.

ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టు ప్యాసింజర్ వచ్చే వరకు చూస్తాడు. వచ్చేకా, అది వెళ్ళే వరకు అన్ని బోగీల్లోకిచూస్తూ, అటునుండి ఇటూ, ఇటు నుండి అటూ తిరుగుతాడు.

రైలు కదిలేవరకు అక్కడె వుండి, కదిలాకా, భారంగా ఓ నిట్టూర్పు విడిచి, మెల్లగా అడుగులో అడుగువేసుకుంటూ వెళ్ళిపోతాడు.

ఇక్కడికి దగ్గర్లోవున్నపల్లె, దాదాపు మూడుమైళ్ళ దూరం.

రోజూ అంత దూరంనుండి ఎందుకు వస్తున్నట్లు?

పోనీ అతని కోసం ఎవరైనా వస్తారా?

ప్చ్........ఎవరూ రారు.

ఒకసారి పోర్టర్ వెంకటయ్య మాటల్లో తెలిసిందేమిటంటే-అతను దగ్గర్లో వున్న పల్లెటూరిలోని పాఠశాల మేష్టారు. దాదాపు ఏడాది అయ్యిందిట అవూరు వచ్చి. మనిషి బక్కపలచగా వుంటాడు, పెద్ద ఎత్తుగా వుండడు, వదులైన పాంట్, లూజ్‌షర్టు వేసుకుంటాడు.

నిర్మలంగా వుండే మొహంలో కొద్దిగా జాలి, ఎక్కువగా కరుణ కన్పిస్తాయి.....కళ్ళలో మాత్రం ఏదో లోతు........చూపులు ఏదో పోగొట్టుకున్న "దాన్ని" వెతుకుతున్నట్టు వుంటాయి,

" అమాయకుడిలా వుంటాడు" అని అంటాడు వెంకటయ్య.

ఎండైనా -

వానైనా -

చలైనా -

వచ్చేవాడు. వస్తున్నాడు.

ఇంత శ్రమపడి రావడ మెందుకు?

ప్రశ్నకి ఎంత ఆలోచించినా జవాబు దొరకడం లేదు.

ఇవాళ -

మధ్యాహ్నంనుండి వాతావరణం అదో మాదిరిగావుంది....మేఘాలు కమ్ముకున్నాయి....రివ్వున ఈదురు గాలులు వీస్తున్నాయి.... చినుకు ఏ క్షణానైనా రావొచ్చు- చలికి భరించలేక స్వెట్టర్ వేసుకున్నాను. యింకా అరగంట వేచి వుండాలి ...ప్యాసింజర్‌కోసం....; గాలి విపరీతంగా వీస్తోంది .....దగ్గర్లోవున్న చెట్లు "లయ"గా తలలు వూపుతున్నాయి....గాలి గంభీరంగా అరుస్తోంది.... క్షణంలో....

చూస్తుండగానే....

గాలి కెరటాల పురవడిలోంచి చినుకులు పడడం ప్రారంభించాయి.... బంగారు తీగెలా మెరిసే మెరుపు....ఆకాశాన్ని చీలుస్తూ కుండపోతగా........ ధారలు ధారలుగా వర్షం....

"ఢన్...." దూరంగా ఎక్కడో పిడుగు పడింది....

ప్రకృతి భీభత్సంగా తయారయ్యింది....

హోరు మనిగాలి....అంతంత చినుకులు....పిడుగు శబ్దం....చినుకులు తాండవం చేస్తున్నాయి....

గాలీ-వానపోటీ పడుతున్నాయి....

స్టేషన్లో కరెంటు పోయింది. ... లాంతరు వెతికి, దీపం వెలిగించడం గగన మయ్యింది....పోర్టర్ కూడలేడు....వూళ్ళో ఎవరో బంధువులు వచ్చేరని, చూడడానికి మధ్యాహ్నమే వెళ్ళాడు -

చీకటి తెరలు అలుము కుంటున్నాయి,

భయ కంపితుడ్ని చేస్తోంది ప్రకృతి?

అరగంట గడిచింది తెలీకుండానే....ఫోన్ మోగింది. ప్యాసింజర్ గంట లేటుట....పక్క స్టేషన్నుండి వర్తమానం వచ్చింది.

మరో పావుగంట తరువాత....

చినుకులవేగం తగ్గింది. లాంతరు వెలుతురులో దూరంనుండి ఎవరో వస్తూ కన్పించారు.. . వెంకటయ్య అనుకున్నాను .... కానీ .... వస్తున్నది "అతను !"

హడావిడిగా వస్తున్నాడు........తలమీదో గుడ్డ కప్పుకున్నాడు. మనిషి దాదాపు తడిసిపోయాడు.

"మేష్టారు....ట్రైన్ వచ్చిందా?" ఆత్రంగా అడిగాడు, మెల్లగా వణుకుతున్నాడు.

"లేదండి....గంటలేటు...."అన్నాను.

"....ఇలా బయటకి అడుగు వేశానో లేదో ...అలా వాన వర్షం ప్రారంభమయ్యింది....చిన్న వానే అనుకున్నా, బాగా తడిపేసింది...." అన్నాడు దూరంగా చూస్తూ. అదృష్టం బాగుండి కరెంటు వచ్చింది. తువ్వాలు వెతికి యిచ్చాను. కృతజ్ఞతగా కళ్ళల్లోకి చూశాడు.

" ట్రైన్ వచ్చేవరకు....ఇక్కడే వుండండి....బాగా కురుస్తోందివాన...." అన్నాను. అక్కడే వున్న కుర్చీ అతనివైపు జరుపుతూ, దానిమీద కూర్చొని వాన లోకి చూస్తున్నాడు.

" ఏవండీ....రోజూ వస్తున్నారు....ఎవరేనా బంధువులు వస్తారా ?.... వస్తున్నారా? ప్రశ్న ఎలావేయాలో తెలీలేదు. ఎందుకు వస్తున్నాడో తెలుసుకోవాలనే కుతూహలం ఆ ప్రశ్న వేసింది,

అతను జవాబు చెప్పలేదు.

"........ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి....దాదాపు మిమ్మల్ని ఏడాది నుండి గమనిస్తున్నాను....వస్తున్నారు....వెళుతున్నారు...."అన్నాను.

క్షణం తరువాత.

"ఎవరూ రారండి....వస్తారేమోనని ఆశ...." అని క్షణం ఆగి.

" నిరీక్షణలో బాధకన్నా ఆనందమే ఎక్కువగా వుంది...."అన్నాడు.

అర్థం కానట్టు చూశాను. అతను చెప్పడం కొనసాగించాడు.

"....ఇన్నాళ్ళు మీరు నన్నడగలేదు....కానీ....మీకో విషయం తెలుసా?"

ఏమిటన్నట్టు చూశాను.

" ...ఎప్పుడూ మీతో చెబ్దామనే ప్రయత్నించాను..... కానీ.... అవకాశం రాలేదు." నేను ఆశ్చర్య పోయాను.

" కష్టాన్నైనా, సుఖాన్నైనా మరొకరితో చెప్పుకుంటే, కాస్త ఓదార్పు కల్గుతుందంటారు."అని వానలోకి క్షణంచూసి.

" ఒక్కో మనిషి జీవితం ఒక్కోరకం....విధాతసృష్టి విచిత్రం ... మనిషికి మమతానురాగాల మధురిమని అందిస్తాడు....రుచినంపూర్ణంగా ఆస్వాదించకుండానే దూరం చేస్తాడు....క్షణం వసంతం....క్షణం శిశిరం....జీవితం సుఖ దుఃఖాల సమ్మేళనం...."అని ఆగి.

" మీకు విసుగ్గావుందా?" అని తెచ్చిపెట్టుకున్న నవ్వు నవ్వాడు. కాగితం పూవులా వుందా నవ్వు.

"లేదు....లేదు....ఇదో విచిత్రమైన అనుభవం....చెప్పండి...." అన్నాను ఆసక్తిగా ముందుకు వంగుతూ....

నా ఆసక్తినిచూసి, మెల్లగా నిట్టూర్పువిడిచి కొనసాగించాడు.

చినుకుల శబ్దం...."అపరిచిత" వ్యక్తి మాటలు ....విచిత్రానుభూతి.... చిత్రమైన కుతూహలం....

" నా జీవితం మొదటినుండి ఒక రకమైన ఆప్యాయతలకి అనురాగాలకి

చేరువుగా వుంది....మా తాతయ్య వాళ్లది ఉమ్మడి కుటుంబం....తాతయ్యకి యిద్దరు కొడుకులు ...ఒకరు వ్యవసాయము....మరొకరు వుద్యోగం....నాన్న గార్కి వుద్యోగం....వుద్యోగరీత్యా అయిన వాళ్ళందర్కి దూరంగా వుండ వలసి వచ్చింది....తాతయ్య చాలాసార్లు నాన్నతో అన్నాడు. "ఎందుకురా నీకా వుద్యోగం....హాయిగా యిక్కడే వుండకా?"అని నాన్నగారికి వ్యవసాయ మంటే యిష్టంలేదు. ఎట్టి పరిస్థితిల్లోను కనీసం ఏడాదికోసారైనా, తాతయ్య గారింట్లోగడపాలనే షరతుమీద తాతయ్య నాన్నగారు వుద్యోగం చేయడాన్కి వప్పుకున్నాడు-" అని ఆగి రెండు క్షణాలు దూరంగా చూస్తుండిపోయాడు.... గాలి హోరు తగ్గుతోంది క్రమేణా....చినుకులు మెల్లగా చిందులు చేస్తున్నాయి-

'ఆ ఏడాది స్కూలుకి వేసవి సెలవులు యిచ్చారు. బాబయ్య ఏదో పనిమీద మా వూరువస్తే, నాన్నగారు వాళ్ళు బాబయ్యతో తాతయ్య గారింటికి పంపారు నన్ను—"లీవ్ శాంక్షన్" అయ్యాక, అమ్మా, నాన్న, చెల్లివస్తామని చెప్పి...."

మెరుపు మెరిసింది....ఒకసారి కాంతి వెల్లువ....మళ్ళీ మామూలే. సిగ్నల్ లైట్ డిమ్‌గా వెలుగుతోంది....

"నాన్నగారు వాళ్ళు వస్తామన్న రోజు....నేనూ బాబయ్య స్టేషన్లో ఎదురు చూస్తున్నాము ...అప్పటికి అమ్మా వాళ్ళని "వదిలి" వారం రోజులయ్యింది.... నాకు బెంగగావుంది.....అమ్మవస్తే ఆమె ఒడిలో ఒదిగి పోవాలనికోరిక....అదే మొదటిసారి వాళ్ళని విడిచి వుండడం....ఎదురు చూస్తున్నాము. ఎంత సేప టికి ట్రైన్ రాలేదు. కొంత సేపటికి తెలిసింది అమ్మావాళ్ళు ఇంకరారని.... వేగంగా వస్తున్న రైలు పట్టాలు తప్పి...." స్పష్టంగా కన్పిస్తున్నాయి కను కొలుకుల్లో కన్నీళ్లు.

గొంతులో స్పష్టంగా జీర.

"....ఆరోజు నుండి అదో అలవాటుగా మారిపోయింది. వస్తున్న ఏ రైలుని చూసినా నా వాళ్లు వస్తున్నారని.... 'నా బంగారు కొండ' అనే అమ్మ, "వెధవా! ఏం చేస్తున్నావ్?" అనే నాన్న 'అన్నయ్య...... నన్ను భయపెట్టె అమ్మతో చెప్పి కొట్టించి....బూచాడికి యిప్పించేస్తా అనే చెల్లి వస్తారని ఏదో ఆశ ...ఆనందంలాంటి విచారం ఎదురుచూపు....

దూరంగా రైలు వస్తున్న కూత విన్పించింది. అతను మెల్లగాలేచాడు.
స్టేషన్‌లోకి వస్తున్న రైలుకేసి అడుగులు వేస్తున్నాడు.
చిన్న చిన్న చినుకులు పడుతున్నాయి.....
చినుకుల మాటున...మసక వెలుతురు చాటున
మెల్లగా "వెతుక్కుంటూ" సాగి పోతున్నాడతను....
రైలుని చూసిన అతని మొహంలో స్పష్టమైన మార్పు ఆనందమా? విచా, రమా?

మరో పది నిముషాల తరువాత.
రైలు కదుల్తోంది....
అతను మెల్లగా సాగుతున్న రైలుతోపాటే నడుస్తున్నాడు ..
బోగీలో ఎవరితోనో మాట్లాడుతున్నాడు....
మాటల్లో నవ్వుతున్నాడు...

నవ్వుతున్నా-
కనుకొలకుల్లో ఆ కన్నీళ్ళెందుకు?

గెలవండి రూ. 125000 విలువ గల బహుమతులు.

14	19	12
13	15	17
18	11	16

ఎంట్రీ రుసుము లేదు.

మొదటి బహుమతి: రాజ్‌దూత్ మోటారు సైకిల్ లేదా రు. 10000 నగదు

కన్సొలేషన్ బహుమతి: అధునాతన ఇంపోర్టెడ్ జపాన్ మోడల్ టూ-ఇన్ వన్ రు. 240/- లకే మా చెయిన్‌లింక్ స్కీము ద్వారా పొందవచ్చును. 10 నుండి 18 వరకు గల అంకెలు వుపయోగించి

13	18	[illegible]
	14	
10	10	15

అడ్డంగా / నిలువుగా / మూలగా, ఎటు కూడినా మొత్తం 42 వచ్చేటట్లు గళ్లు నింపండి.

ఒక అంకె ఒకసారి మాత్రమే వ్రాడాలి. మీ ఎంట్రీలు 15 రోజులలోగా పంపండి.

GOOD LUCK Co. (WKH)

1·36, New Layalpur, Delhi-51